నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 29 మార్చి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

గద్వాలలో సీఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

పోలీసుల ఓవరాక్షన్

- ఎమ్మెల్యే, సీఐ మధ్య మాటల యుద్ధం
- దివ్యాంగ ప్రజాప్రతినిధి ఓటేశాక కేంద్రం బయటకు వెళ్తానన్న ఎమ్మెల్యే
- ఇప్పుడే వెళ్లాలంటూ పట్టుబట్టిన సీఐ
- ఇద్దరి మధ్య పెరిగిన మాటామాట
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బండ్ల
- సర్దిచెప్పిన పోలీసులు

గద్వాల, మార్చి 28 : ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ గద్వాలలో వందశాతం సమోదైంది. అయితే ఎన్నికల వేళ పోలీసులు ఓవరాక్షన్ ప్రదర్శించారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలోని పోలింగ్ స్టేషన్‌లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలతో కలిసొచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం బయటకు వచ్చి దివ్యాంగురాలైన ఎంపీటీసీ ఓటు వేయాల్సి ఉండగా.. ఆమె కోసం ఎమ్మెల్యే సమావేశ మందిరం బయట నిలబడ్డాడు. అయితే అక్కడికి చేరుకున్న సీఐ ఎమ్మెల్యేను అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. దివ్యాంగురాలు వస్తుందని, ఆమె ఓటు వేసిన వెంటనే వెళ్లిపోతామని సీఐకి చెప్పినా వినకపోవడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఓటు వేయడానికి వచ్చిన ప్రజాప్రతినిధులపై సైతం సీఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెళ్లి పోతామని చెప్పినా ఎందుకలా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా పోలీస్ సిబ్బంది సర్దిచెప్పి పంపించారు. అనంతరం పోలీసులు, పాత్రికేయుల మధ్య మాటలయుద్ధం నెలకొన్నది. ఓటింగ్ జరిగే పరిసరాల్లో పాత్రికేయులు ఉండొద్దని.. అక్కడినుంచి వెళ్లిపోవాలని సూచించారు. తమకు పాస్‌లు ఉన్నాయని, అక్కడ ఉండే హక్కు తమకు ఉందని పాత్రికేయులు చెప్పినా పోలీసులు పట్టించుకోకపోవడంతో తమకు ఇచ్చిన పాస్‌లు అవసరం లేదని చెప్పి జిల్లా సమాచార శాఖ అధికారికి అప్పగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎన్నికల వేళ పోలీసుల ఓవరాక్షన్‌తో ఎమ్మెల్యేతో పాటు రిపోర్టర్లు సైతం ఇబ్బందులు పడ్డారు. అయితే ఎమ్మెల్యే వెళ్లిన తర్వాత ఓటింగ్ జరిగే ప్రాంతాల్లో ఇతరులు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం కొసమెరుపు. అనంతరం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, తమ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కాంగ్రెస్‌లో వర్గపోరు

ఓటింగ్ సమయంలో మరోసారి కాంగ్రెస్ నాయకుల మధ్య వర్గపోరు భగ్గుమన్నది. మొదటగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కౌన్సిలర్లతో కలిసొచ్చి ఓటు వేసి వెళ్లిపోయారు. అనంతరం మరో వర్గమైన బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ శంకర్, ఎంపీటీసీలతో కలిసి ప్రత్యేక బస్సులో వచ్చి ఓటు వేసి వెళ్లారు. అలంపూర్‌కు చెందిన కొంతమంది కాంగ్రెస్ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు వచ్చి ఓటు వేసి వెళ్లారు.

మహబూబ్‌నగర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్‌లో బ్యాలెట్ బాక్సులకు సీల్ వేస్తున్న ఎన్నికల అధికారులు

జడ్చర్లకు చెందిన ప్రజాప్రతినిధులతో జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య

స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్సులు

అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి సీల్ చేసిన బ్యాలెట్ బాక్స్‌లను గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌కు తరలించారు. సాయుధ పోలీస్ బలగాల బందోబస్తుతో బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సామగ్రిని పాలమూరులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటర్లకు చేరవేశారు. అనంతరం వాటిని పరిశీలించి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఏప్రిల్ 2న జరిగే కౌంటింగ్‌లో ఈ బాక్స్‌లను ఓపెన్ చేస్తారు. రిసెప్షన్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సామగ్రిని భద్రపరిచే ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు వాణీప్రసాద్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో స్ట్రాంగ్‌రూంకు బ్యాలెట్ బాక్స్‌లు తీసుకెళ్తున్న ఎన్నికల అధికారులు

సజావుగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

ఓటు వేసేందుకు వస్తున్న కోయిలకొండకు చెందిన ప్రజాప్రతినిధులు

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైనవి..	శాతం
మహబూబ్‌నగర్	245	245	100
వనపర్తి	218	218	100
అచ్చంపేట	79	79	100
కొడంగల్	56	56	100
షాద్‌నగర్	171	171	100
కల్వకుర్తి	72	72	100
కొల్లాపూర్	67	67	100
గద్వాల	225	225	100
నాగర్‌కర్నూల్	101	100	99
నారాయణపేట	205	204	99
మొత్తం	1,439	1,437	

99.86 శాతం పోలింగ్

8 కేంద్రాల్లో 100 శాతం, 2 కేంద్రాల్లో 99 శాతం

- ఉమ్మడి జిల్లాలో 10 పోలింగ్ కేంద్రాలు
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్
- కొడంగల్‌లో ఓటేసిన సీఎం రేవంత్
- ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు
- అన్న కొడుకు కాంగ్రెస్ అభ్యర్థి అయినా బీఆర్ఎస్‌కే కట్టుబడిన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- క్రాస్ ఓటింగ్‌పై అనుమానాలు
- కేంద్రాల వద్ద అధికార దుర్వినియోగం
- హస్తం పార్టీ నేతల కనుసన్నల్లో పోలీసులు

మహబూబ్‌నగర్, మార్చి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల శాసనమండలి ఉపఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. గురువారం సీఎంతో సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఓటు వేసేందుకు బారులుదీరారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో 10 (నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, నారాయణపేట, మహబూబ్‌నగర్, కొడంగల్, షాద్‌నగర్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 8 చోట్ల 100 శాతం ఓటింగ్ నమోదైంది. కాగా మరో రెండు చోట్ల ఇద్దరు స్థానిక ప్రజాప్రతినిధుల గైర్హాజరుతో మొత్తం 1,439 మంది ఓటర్లగానూ 1,437 మంది వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 99.86 శాతం పోలింగ్ నమోదైంది. కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. గద్వాలలో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మహబూబ్‌నగర్‌లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఓటు వేయగా.. ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి పలు కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసి ఆయా జిల్లా కలెక్టర్లు కంట్రోల్ రూమ్‌ల వద్ద పర్యవేక్షించారు. మహబూబ్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్, నారాయణపేటలో కలెక్టర్ కోయ హర్ష, వనపర్తిలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, గద్వాలలో కలెక్టర్ బీఎం సంతోష్, నాగర్‌కర్నూల్‌లో కలెక్టర్ ఉదయకుమార్ కేంద్రాలను పరిశీలించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉప ఎన్నికల పోలింగ్ ఆయా జిల్లా ఎస్పీలతో కలిసి జోగులాంబ జోన్ డీఐజీ చౌహాన్ పర్యవేక్షించారు. ఎక్కడా చిన్న ఘర్షణ కూడా చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పార్టీల వారీగా ప్రజాప్రతినిధులు ఓటేసి వెళ్లిపోయారు. ఓటర్ గుర్తింపు కార్డులతోపాటు ఆధార్ కార్డులను కూడా తీసుకొచ్చి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ప్రాధాన్యతా క్రమంలో ఓటేసే అవకాశం ఉండటంతో ప్రజాప్రతినిధులను పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి కూర్చోబెట్టారు. ఒక్కొక్కరినీ ఓటు వేసేందుకు పంపించారు. కేంద్రాల వద్ద ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో సాఫీగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మీడియాకు అనుమతి నిరాకరణ

పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన కొద్దిసేపటికే కొన్ని కేంద్రాల వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మీడియాను అనుమతించకుండా కొద్దిసేపు బయటనే ఉంచారు. కాగా ఓ విచిత్రమైన సంఘటన చోటుచేసుకున్నది. సొంత అన్న కొడుకు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా పోటీలో ఉన్నా మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాత్రం బీఆర్ఎస్ పార్టీకి కట్టుబడ్డారు. మొన్నటివరకు బీఆర్ఎస్‌లో ఉన్న జీవన్‌రెడ్డి ఫ్లేట్ ఫిరాయించి అధికార పార్టీ వైపు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. కాకా బాబాయ్ మాత్రం గులాబీ పార్టీ సిట్టింగ్ ఎంపీగా కొనసాగుతున్నారు. రాబోయే ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్నారు. కాగా ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఎక్స్ అఫీషియల్ సభ్యునిగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి పార్టీ అభ్యర్థికి ఓటేశారన్న సమాచారంతో కుటుంబాలు ఒక్కటైనా.. పార్టీలు, సిద్ధాంతాలు వేరని నిరూపించారు. చాలా చోట్ల అధికార పార్టీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారు. కొంతమంది ఏజెంట్లుగా ఉన్నప్పటికీ వారంతా ఎంపీటీసీలను వెంటేసుకొని పోలింగ్ కేంద్రాల లోపలికి ప్రవేశించడం కనిపించింది. మరోవైపు ఎమ్మెల్సీ పోలింగ్ జరుగుతున్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీకి చెందిన ప్రచార వాహనాలు పోలింగ్ కేంద్రం ఎదుట నుంచి వెళ్లినా పోలీస్ యంత్రాంగం పట్టించుకోకపోవడం గమనార్హం. చాలా చోట్ల అధికార పార్టీ నేతలకే పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పేట, నాగర్‌కర్నూల్‌లో 99 శాతం

ఎమ్మెల్సీ ఉపఎన్నిక తీవ్ర ఉత్కంఠ మధ్య కొనసాగింది. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకే ప్రారంభమైంది. పోలీసు యంత్రాంగం కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసి బారికేడ్లను ఏర్పాటు చేశారు. వచ్చిన ప్రతి ఓటరును క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత అన్నీ సక్రమంగా ఉండడంతో లోపలికి ఓటేసేందుకు అనుమతించారు. మరోవైపు పోలింగ్ కేంద్రం సమీపంలోనే అధికార పార్టీ నేతలు తచ్చాడుతున్నా పోలీసు యంత్రాంగం పట్టించుకోకపోవడం గమనార్హం. మహబూబ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 245 మందికిగానూ 245 మంది, కొడంగల్‌లో 56 ఓట్లకుగానూ 56 మంది, వనపర్తిలో 218 ఓట్లకుగానూ 218, కల్వకుర్తిలో 72 ఓట్లకుగానూ 72 మంది, అచ్చంపేటలో 79 ఓట్లకుగానూ 79 మంది, షాద్‌నగర్‌లో 171 మందికిగానూ 171, కొల్లాపూర్‌లో 67 ఓట్లకుగానూ 67, గద్వాలలో 225 ఓట్లకుగానూ 225 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 8 పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. నారాయణపేటలో 205 ఓటర్లకుగానూ 204 మంది, నాగర్‌కర్నూల్ పోలింగ్ కేంద్రంలో 101 ఓట్లకుగానూ 100 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో రెండు జిల్లాల్లో మాత్రమే 99 శాతం పోలింగ్ నమోదైంది.

క్రాస్ ఓటింగ్ భయం

ఎమ్మెల్సీ ఉపఎన్నికలు అధికార పార్టీకి, అటు ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు పరీక్షగా మారాయి. పోలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ ఎవరు గెలుస్తారో అన్నదానిపై ఉత్కంఠ కొనసాగుతున్నది. రెండు పార్టీల అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకున్నది. ఎక్కడ జంపుజిలానీలు ఉన్నారో.. చివరి నిమిషంలో ఎవరికి ఓటేశారో తెలియని పరిస్థితి నెలకొన్నది. చాలామంది స్థానిక ప్రజాప్రతినిధులు తమను పట్టించుకోలేదని, ఆయా పార్టీలను వదిలి ఇతర పార్టీలోకి చేరిపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి సంఖ్యాబలం లేనప్పటికీ జంపు జిలానీలతో పోటీకి దిగింది. కాగా అభ్యర్థిపై ఎమ్మెల్యేలు అసంతృప్తి స్పష్టంగా కనిపించింది. ఎమ్మెల్యేలు ఓటు వేసి వెళ్లిపోవడం.. ఓటింగ్ సరళి పట్టించుకోకపోవడంతో మిగతా నేతలు ఖంగుతిన్నారు. మొత్తంపైన ఏప్రిల్ 2న జరిగే కౌంటింగ్‌లో అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

మహబూబ్‌నగర్‌లో పోలింగ్ సరళిని పరిశీలించి వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి

నిఘా నీడలో పోలింగ్..

శాసనమండలి ఉపఎన్నికకు అధికారులు కనీవినీ ఎరుగని రీతిలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్ ఆధ్వర్యంలో ఇతర జిల్లా కలెక్టర్లు సమన్వయ పర్చుకుని పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద చిన్న సంఘటన నమోదు కాకుండా ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు. మరోవైపు అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. వెబ్ కెమెరాలతో పోలింగ్ సరళిని పరిశీలిస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థులకు, ఓటు వేసే ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. గుంపుగా ఓటు వేయడానికి వచ్చినప్పటికీ వారందరినీ ఒకచోట కూర్చోబెట్టి ఒక్కొక్కరినీ ఓటేయడానికి పంపించారు. ప్రాధాన్య క్రమంలో బ్యాలెట్ పద్ధతిలో ఓటు వేయడంతో ఒక్కొక్క ప్రజాప్రతినిధికి రెండు మూడు నిమిషాల సమయం పట్టింది. మరోవైపు పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ పత్రాలు.. వాటిపై అభ్యర్థుల ఫొటోలు, పేర్లు కనబడే విధంగా వెలుతురు ఉండేలా చూశారు. మరోవైపు పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. దీంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

అధికార పార్టీ కనుసన్నల్లో..

ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరుగుతున్న పోలింగ్ కేంద్రాల వద్ద అధికార పార్టీ చెందిన కొంతమంది చోటామోట నేతలు హల్‌చల్ చేశారు. మహబూబ్‌నగర్ పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల ఏజెంట్‌గా ఉన్న పీసీసీ కార్యదర్శి వినోద్ ఏకంగా ఐడీ కార్డుకు కాంగ్రెస్ పార్టీ గుర్తును పోలివున్న ట్యాగ్ ధరించి తిరగడం కనిపించింది. అంతే కాకుండా జిల్లా కలెక్టర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తుంటే ఆయన వెంటే ఉండటం కూడా విమర్శలకు తావిచ్చింది. మిగతా పోలింగ్ కేంద్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడడం స్పష్టంగా కనిపించింది. ఇటు పోలింగ్ సిబ్బంది.. అటు పోలీస్ యంత్రాంగం కూడా వారికి పూర్తి స్థాయిలో సహకరించినట్లు కనిపిస్తోంది. పాసులు ఉండి ఓటర్లను మాత్రమే అనుమతించాల్సిన పరిస్థితుల్లో అధికారపార్టీ నేతలు అందరూ లోపలికి చొచ్చుకువచ్చి కేంద్రాల సమీపంలో దూసుకెళ్లారు. దీంతో బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పించారు.

అలంపూర్‌కు చెందిన ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, పాలమూరులో ఓటు వేసి వస్తున్న ఎంపీ మన్నె

కొడుకు పెళ్లి చేసి పరుగు.. పరుగునా..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసిన ఎంపీటీసీ
- వనపర్తికి అంబులెన్స్‌లో వచ్చిన మరో ప్రజాప్రతినిధి

వనపర్తి, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : మహబూబ్‌నగర్ స్థానికసంస్థల ఉప ఎన్నికల్లో వనపర్తి జిల్లా నుంచి వందశాతం పోలింగ్ జరిగింది. ఎమ్మెల్యే మేఘారెడ్డితోపాటు మిగిలిన 218 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాగా ఏదుల ఎంపీటీసీ నరేందర్ 20 రోజుల కిందట ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. కోమాలోకి వెళ్లిన ఎంపీటీసీ ఇంకా పూర్తి స్థాయిలో కోలుకోకపోవడంతో ఓటింగ్ కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో తీసుకొచ్చి స్ట్రచర్ మీదనే పోలింగ్ కేంద్రానికి చేరుకొని అతని భార్య సహకారంతో ఓటు వేశారు. అమడబాకుల ఎంపీటీసీ శేషిరెడ్డి తన కుమారుడి వివాహం హైదరాబాద్ సాగర్ రింగ్‌రోడ్డులో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించారు. 12 గంటల వరకు తంతు కొనసాగించిన శేషిరెడ్డి హుటాహుటిని బయలుదేరి పోలింగ్ కేంద్రానికి పరుగెత్తుకొచ్చి ఓటు వేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా శేషిరెడ్డి ఓటింగ్‌లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయేవారు.

ఓటు వేసేందుకు పరుగున వస్తున్న ఎంపీటీసీ

ఏదుల ఎంపీటీసీని స్ట్రేచర్‌పై తీసుకువస్తున్న దృశ్యం

తాళం వేసిన ఇంటికి కన్నం

- రూ.10లక్షల నగదు, 30 తులాల బంగారం చోరీ
- కేసు నమోదు చేసిన పోలీసులు

గద్వాల అర్బన్, మార్చి 28 : తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి అందినకాడికి దోచుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. బాధితుడి కథనం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన రాజేశ్ వ్యక్తిగత పని నిమిత్తం తన కుటుంబసభ్యులతో కలిసి రెండురోజుల కిందట బెంగళూరుకు వెళ్లాడు. ఈక్రమంలో ఇంటి పరిసరాలను పరిశీలించిన దొంగలు ఎవరూ లేని సమయంలో తాళం వేసిన ఇంట్లోకి చొరబడి రూ.10లక్షల నగదు, 30 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. గురువారం తిరిగొచ్చిన రాజేశ్ ఇంటి తాళం తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి దొంగతనం జరిగినట్లు గ్రహించాడు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

బీరువాలోని వస్తువులు చిందరవందరగా వేసిన దృశ్యం

పరీక్ష రాసి వస్తున్న విద్యార్థిని అనూష

పుట్టెడు దుఃఖంలోనూ..

- టెన్త్ పరీక్ష రాసి తమ్ముడి అంత్యక్రియల్లో పాల్గొన్న అనూష

మరికల్, మార్చి 28 : తోడబుట్టిన తమ్ముడు అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబసభ్యుల సూచన మేరకు పుట్టెడు దుఃఖంలోనూ అక్క టెన్త్ పరీక్షకు హాజరైన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. మరికల్‌కు చెందిన కుర్వ రామాంజనేయులు కుమారుడు అర్జున్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా మృతుడి అక్క అనూష తల్లిదండ్రుల సూచన మేరకు గు రువారం పదోతరగతి పరీక్ష రాసి వచ్చాక తమ్ముడి అంత్యక్రియల్లో పాల్గొన్నది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

శ్రీ అయ్యప్ప స్వాచురల్ అయిల్ కట్టె గానుగ నూనెలు
SBI పద్మావతి కాలనీ బ్రాంచ్ ఎదురుగా, మహబూబ్‌నగర్. సెల్ : 9700618560
మా వద్ద పల్లినూనె, కొబ్బరి నూనె (బురిడీ) నువ్వుల నూనె, సన్‌ఫ్లవర్ కుసుమ నూనె, ఆముదం నూనెలు లభించును

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794